# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 02-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పేదల జీవితాల్లో వెలుగులు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కెనడా హై కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు.**

3. **కాశీబుగ్గ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలోని మృతుల కుటుంబాలకు 15 లక్షల రూపాయల పరిహారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందజేయనున్నట్లు మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.**

4. **పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు అందరికీ ప్రభుత్వం పరిహారం అందజేయనుందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**

==========================

పేదల జీవితాల్లో వెలుగులు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా.. స్వయంగా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. శ్రీ సత్యసాయి జిల్లా పెద్దన్నవారిపల్లె లో పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

(వాయిస్.. 28 సెకన్లు)

రాష్ట్ర వ్యాప్తంగా నిన్న 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పింఛన్లను పంపిణీ చేశారు.

--------------------------

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కెనడా హై కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు. ఇండియాలోని కెనడా హై కమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ బృందం ముఖ్యమంత్రిని హైదరాబాదులోని ఆయన నివాసంలో నిన్న కలిసింది. ఈ సందర్భంగా ఐటి, ఫార్మా, రక్షణ, పట్టణ మౌలిక సదుపాయాల్లో కెనడా భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడంపై చర్చించారు. అనంతరం ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను కెనడా హై కమిషనర్ బృందానికి వివరించిన ముఖ్యమంత్రి, స్టార్టప్స్, విద్యా, సాంకేతిక

రంగాల్లోను పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ ఘటనలో మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ ఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి 2 లక్షల రూపాయలు, క్షతగాత్రులకు 50 వేల రూపాయలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు అనిత, అచ్చెన్నాయుడులతో కలిసి నిన్న సాయంత్రం పలాస ఆసుపత్రికి చేరుకున్న ఆయన బాధితులను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అంతకుముందు ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతుల కుటుంబాలకు 15 లక్షల రూపాయల పరిహారాన్ని అందజేయనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ తెలియజేస్తూ...

(వాయిస్.. 35 సెకన్లు)

---------------------------

వ్యవసాయ శాఖ పరిధిలో గల అన్ని సంస్థలు సమర్థవంతంగా పని చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాదులోని ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఆయన నిన్న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా రైతాంగానికి సేవలు అందించిన ఆగ్రోస్ సంస్థను పునరుద్ధరించి మళ్ళీ రైతాంగానికి సేవలు అందించేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు.

---------------------------

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ ప్రభుత్వం పరిహారం అందజేయనుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఏలూరు జిల్లా వేలేరుపాడులో నిర్వాసితులకు వెయ్యి కోట్ల రూపాయల పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. 41.15 కాంటూరు వరకూ నిర్వాసితులకు పరిహారం పంపిణీ కార్యక్రమం పూర్తి చేశామని, మిగిలిన వారికి త్వరలోనే పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. సర్వే లోపాల వల్ల ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

(వాయిస్.. 34 సెకన్లు)

---------------------------

గిరిజన జాతి అభ్యున్నతి కోసం కృషి చేసిన బిర్సా ముండాను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతిపురం మన్యం జిల్లాలో గిరిజన స్వాభిమాన ఉత్సవాల ప్రారంభ కార్యక్రమం నిన్న జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారన్నారు.

---------------------------

మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని కుంకుపాడు, మోదేపల్లి, పార్వతీపురం గ్రామాలను నిన్న సందర్శించారు. తుఫాన్ కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న పంట పొలాలు, వంతెనలు, రహదారులను పరిశీలించారు. పంటనష్టం అంచనాలను సక్రమంగా నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తుఫాను కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

---------------------------

బాలికా విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలోని బొండపల్లి గ్రామంలో తాగునీటి పథకం, కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్ భవనాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఆడబిడ్డ తప్పనిసరిగా చదువుకోవాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలో మార్కెట్ యార్డు, రైతు బజార్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిన్న జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. పంటల సేకరణ, మౌలిక సదుపాయాల మెరుగుదల, రహదారి మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థ కోసం చర్యలు చేపడతామని తెలిపారు.

---------------------------

ఐసిసి మహిళల ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఈ రోజు ముంబయిలో జరగనుంది. టైటిల్ కోసం ఫైనల్‌కు చేరుకున్న భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుంది.

ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత పురుషుల క్రికెట్ జట్టు టి 20 మూడవ మ్యాచ్‌లో భాగంగా ఈరోజు ఆస్ట్రేలియాలోని హోబర్ట్ వేదికగా జరిగే మ్యాచ్‌లో తలపడనుంది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 7 గంటల 15 నిముషాలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు

కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ,

వాయిస్ 19 సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================